# పదికి పది గెలుస్తాం



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

## ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి ఖిల్లాగా మారింది..



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని నలంద కళాశాల నుంచి భారీ బైక్ ర్యాలీతో సభ వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాగా ఉన్న ఆదిలాబాద్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితంగా అభివృద్ధి ఖిల్లాగా మారిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉట్నూర్, ఆదిలాబాద్ పట్టణాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి ప్రసంగించారు. ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకత ఉందని, ఉద్యమ సమయంలో సిద్ధిపేట, ఆదిలాబాద్‌లో తెలంగాణ వచ్చేంత వరకు దీక్షా శిబిరాలు కొనసాగాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితంగా జిల్లా వ్యవసాయం, ఐటీతోపాటు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ పది సీట్లలో ఘన విజయం సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో మెడికల్ కళాశాలలు, ఆదిలాబాద్‌లో నర్సింగ్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోయర్ పెనగంగ ప్రాజెక్టు జిల్లా రైతుల చిరకాల వాంఛ అని, ఉమ్మడి రాష్ట్రంలో జిల్లా నాయకులు ప్రాజెక్టు నిర్మిస్తామని రైతులను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు కలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేసి రైతుల్లో సంతోషాన్ని నింపారన్నారు. ప్రాజెక్టు బరాజ్, పంప్‌హౌస్, కాలువల పనులు పూర్తికాగా ట్రయల్ రన్ విజయవంతమైందన్నారు. అందరికీ ప్రయోజనం చేకూర్చే బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను కా ర్యకర్తలు కష్టపడి ప్రతి ఇంటికి తీసుకుపోయి వివరించాలని కోరారు. ఇటీవల ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ విషయంలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం సీసీఐ స్క్రాప్‌ను అమ్మకానికి పెట్టిందని ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని, డిపాజిట్ రాకుండా చూడాలని కోరారు. ఆదిలాబాద్ ఎమ్మె ల్యే జోగు రామన్న నిఖార్సాయిన ఉద్యమకారుడు. తెలంగాణ కోసం పదవీ త్యాగం చేశాడని, పది సంవత్సరాల్లో నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు.



కుమ్రం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి హరీశ్ రావు, బీఆర్‌ఎస్‌లోకి నాయకుడిని ఆహ్వానిస్తూ..

### కాంగ్రెస్, బీజేపీలు ఒకటే..

తెలంగాణలో సెక్యులర్ ప్రభుత్వాన్ని కూల్చడానికి కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటయ్యాయని మంత్రి పేర్కొన్నారు. గతంలో జరిగిన దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడులో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోయిందని, రెండు పార్టీలకు అంతర్గతంగా ఒప్పందం చేసుకుని కాంగ్రెస్ వాళ్లు బీజేపీకి ఓటు వేశారని తెలిపారు. బీజేపీ నాయకులందరూ కాంగ్రెస్‌లో కలుస్తున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల్లో ఒకరికొకరు సాయం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని తెలిపారు. జిల్లాలో బీజేపీ నాయకులను మహారాష్ట్రకు తీసుకుపోయి అక్కడి అభివృద్ధి ఎలా ఉందో చూపించాలని సూచించారు.

### అందరికీ ఆమోదయోగ్యంగా మ్యానిఫెస్టో

బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ.1200 చేసిందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో వచ్చిన వెంటనే రూ.400 లకు తగ్గిస్తామన్నారు. రైతుబంధు సాయం రూ.16 వేలకు పెంచుతామని, ఆసరా పింఛన్లు నెలకు రూ.5 వేలు అందజేస్తామని తెలిపారు. పేదలకు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం, మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ.3 వేలు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 15 లక్షలు కార్పొరేట్ వైద్యం అందిస్తామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్‌ఎస్ అధికారంలో వచ్చి కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఖానాపూర్ ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ సభలకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, నృత్యాలు, బీఆర్‌ఎస్, జిందాబాద్, కేసీఆర్ జిందాబాద్ అనే నినాదాలతో సభా ప్రాంగణాలు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ నగేశ్, బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు తుల శ్రీనివాస్, నాయకులు సాజొద్దీన్, లింగారెడ్డి, అలాల అజయ్ పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావుకు చిత్రపటం అందజేస్తున్న బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్



మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ మహిళ నాయకురాళ్లు



మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బేల ఎంపీపీ , నాయకులు

# చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిండు..

## గిరిజనేతరుల భూములకు హక్కుపత్రాలు

- గిరిజన గూడేలు, తండాలు జీపీలుగా చేసినం ● ఏజెన్సీలో మరణాలు లేకుండా చేసినం..
- ఉట్నూర్‌ను 100 పడకల దవాఖానగా మార్చినం ● గిరిజనేతరులకు ఇల్లు కట్టుకునేందుకు అవకాశం ఇస్తాం..
- జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి ● రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



ఉట్నూర్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో భూక్యా జాన్సన్ నాయక్

ఉట్నూర్, అక్టోబర్ 28 : ముఖ్యమంత్రి కేసీఆర్ చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిండని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం ప్రజా ఆశీర్వాద సభలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు హెలికాప్టర్‌లో స్థానిక కుమ్రం భీం ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడి నుంచి స్థానిక ఎంపీడీవో మైదానంలో ఏర్పాటు చేసిన సభాస్థలానికి చేరుకొని మాట్లాడారు. ఒక్కసారి చాన్స్ కావాలంటోంది కాంగ్రెస్.. గతంలో పదకొండు సార్లు గెలిపిస్తే ఏం చేశారో చెప్పాలన్నారు. ఏజెన్సీలో ఒకప్పుడు విషజ్వరాలు ప్రబలి మరణాలు సంభవించేవి. జ్వరాలు రాకుండా మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధజలాన్ని అందిస్తున్నాం. కేసీఆర్ పథకాలతో గ్రామాల్లో పారిశుధ్యం, చెట్ల పెంపు, రోడ్ల నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మార్చామన్నారు. ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ కర్ణాటకలో గెలిచినంక ఏం చేస్తుందో చూడాలన్నారు. మహారాష్ట్రలో బీజేపీ కూడా మూడు గంటల కరెంట్ ఇవ్వలేక పోతుందన్నారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగం అవుతది. 24 గంటలు కరెంట్ ఇచ్చే కేసీఆర్ కావాలో...రాష్ట్రాన్ని ఆగం చేసే పార్టీలు కావాలో ప్రజలే తెల్చుకోవాలి. ఏజెన్సీలో గిరిజనేతరులకు అసైన్డ్ ల్యాండ్స్‌కు పూర్తి హక్కులు ఇస్తామన్నారు. గిరిజనేతరులు ఇండ్లు కట్టుకునేందుకు హక్కు కల్పిస్తాం. క్రయ, విక్రయాలకు అవకాశాలు కల్పిస్తాం. గిరిజన రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచాం. కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఐకే రెడ్డి, శాసనమండలి అధ్యక్షుడు స్వామిగౌడ్, ఉమ్మడి జిల్లా ఎంఎల్‌సీ దండె విఠల్, ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఏపీపీఎస్‌సీ మాజీ సభ్యుడు రవీందర్, మాజీ ఎంపీ నగేశ్, ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు పాల్గొన్నారు.

### జాన్సన్ నాయక్‌ను గెలిపించండి..

గతంలో పనిచేసిన వాళ్లు కమీషన్లకు కక్కుర్తి పడ్డారని.. ఇప్పుడు జాన్సన్ నాయక్ చదువుకున్న వ్యక్తి అభివృద్ధి చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చాడన్నారు. తనకు అమెరికాలో ఐటీ కంపెనీ ఉందని అయినా సేవ చేసేందుకు వచ్చాడన్నారు. కేటీఆర్ మిత్రుడైన జాన్సన్ నాయక్ మా ఫ్యామిలీ సభ్యుడన్నారు. తనను ఉట్నూర్‌కు 100పడకల ఆసుపత్రిగా పెంచే వరకు విడువలేదన్నారు. బాల్క సుమన్ కూడా తమ ఫ్యామిలీ సభ్యుడని, తనకు చెన్నూర్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే చాలా అభివృద్ధి చేసి చూపిస్తున్నాడన్నారు. అలాగే జాన్సన్ నాయక్ కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. పైగా జాన్సన్ నాయక్‌కు ఐటీ కంపెనీతోపాటు నిధులు తెచ్చి స్వచ్ఛంద కార్యక్రమాలు చేయించగల సత్తా ఉందన్నారు. జాన్సన్ నాయక్‌ను గెలిపించండి ఐదేండ్ల వరకు సేవకుడిగా పనిచేస్తాడన్నారు. ఉట్నూర్ పట్టణంలో కుమ్రం భీం ప్రాంగణం నుంచి ఐటీడీఏ వరకు నాలుగు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తాం. కుప్టి ప్రాజెక్ట్ నిర్మిస్తాం, కడెం ప్రాజెక్ట్, సరస్వతి కాలువలను ఆధునీకరిస్తాం, సేవాలాల్ భవనం, దళిత భవనాలు నిర్మిస్తామన్నారు. కాగా.. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఉపేందర్, రాజమణి, అహ్మద్‌లతోపాటు పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి హరీశ్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



సభకు హాజరైన ప్రజలు

### గిరిజనులకు పోడు పట్టాలిచ్చాం..

ఏజెన్సీలోని గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌ది అని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, బీఆర్‌ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. తనపై నమ్మ కం ఉంచిన కేసీఆర్, కేటీఆర్‌లకు రుణపడి ఉంటామన్నారు. గిరిజన బిడ్డగా గిరిజనులను, యువతకు మంచి అవకాశాలు కల్పిస్తూ అందరి నమ్మకాన్ని నిలబెడతానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తానన్నారు. భారీ మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపిస్తే కేసీఆర్ మరోసారి సీఎం అయి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా చేస్తారన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



జోడేఘాట్‌లో కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కుమ్రం భీం మనుమడు సోనేరావ్, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సురేశ్‌కుమార్

# వీరుడికి ఘన నివాళి

## జోడేఘాట్‌లో కుమ్రం భీం వర్ధంతి

- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ● సంస్కృతీ సంప్రదాయాల నడుమ భీం వారసుల పూజలు
- వేలాదిగా తరలివచ్చిన అడవిబిడ్డలు.. జన సంద్రమైన పోరుగడ్డ ● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు ● ఎన్నికల కోడ్ కారణంగా రద్దైన దర్బార్ ● పోలీసుల భారీ బందోబస్తు



కుమ్రం భీం సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/ కెరమెరి, అక్టోబర్ 28 : ఆదివాసుల ఆరాధ్యదైవం కుమ్రం భీం 83వ వర్ధంతిని జోడేఘాట్‌లో శనివారం అధికారికంగా నిర్వహించారు. తెలంగాణ నుంచే గాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి అడవిబిడ్డలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరాగా, పోరుగడ్డ పరవశించింది. డప్పు, సన్నాయి, కాలీకోం వాయిద్యాలు, గుస్సాడీ నృత్యాలు, కోలాటాలతో ఆ ప్రాంతం మారుమోగింది. కుమ్రం భీం వారసులు, వంశీయులు సంస్కృతీ సంప్రదాయల నడుమ పూజా కార్యక్రమం నిర్వహించి అమరవీరుల జెండాలను ఎగురవేశారు. అనంతరం భీం విగ్రహం, సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### నివాళులర్పించిన ప్రముఖులు

భీం వర్ధంతికి ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. భీం మనువడు కుమ్రం సోనేరావ్, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయి, ఎస్పీ సురేశ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై కుమ్రం భీం, ఆయన అనుచరుడు కుమ్రం సూరుకు ఘనంగా నివాళులర్పించారు.

### కుమ్రం సూరు వర్ధంతి..

కుమ్రం సూరు వర్ధంతిని జోడేఘాట్‌లో అధికారికంగా నిర్వహించారు. సూరు మనువడు కుమ్రం పాండు ఆధ్వర్యంలో కొలాం ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి నివాళులర్పించారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

9 తెగల ఆదివాసులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గోండి, తెలుగు భాషలో కళాకారులు పాడిన పాటలు, ఆదివాసీ కళాకారులు చేసిన గుస్సాడీ, థింసా నృత్యాలు కనువిందు చేశాయి.

### అందరికీ తాగునీరు, భోజనం

ప్రభుత్వం హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది. వర్ధంతికి వచ్చిన మహిళలు, పురుషులు, వీఐపీలు, పోలీసులు, మీడియాకు వేర్వేరుగా తాగునీరు, భోజన సౌకర్యం కల్పించారు.

### వైద్య శిబిరం, ఫిర్యాదుల విభాగం..

వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరంతో పాటు మొబైల్ దవాఖాన ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఏటా నిర్వహించే గిరిజన దర్బార్ రద్దు అయింది. అధికారులు ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించి అర్జీలను స్వీకరించారు.

### జాతరను తలపించిన వైనం..

భీం వర్ధంతి సందర్భంగా జోడేఘాట్ జాతరను తలపించింది. పెద్ద సంఖ్యలో దుకాణాలు, హోటళ్లు ఏర్పాటు చేశారు. రూ. 25 కోట్లతో నిర్మించిన భీం స్మృతి చిహ్నం, కాంస్య విగ్రహంతో పాటు మ్యూజియంలో ఏర్పాటు చేసిన చిత్రాలు, కళాఖండాలను చూడడానికి జనం ఎగబడ్డారు.

### భారీగా పోలీసు బందోబస్తు

భీం సంస్మరణ సభ సందర్భంగా తరలివచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్పీ కే.సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు రహదారి పొడువునా తనిఖీలు చేశారు. పహారా కాశారు.

### పాల్గొన్న అధికారులు.. ప్రజాప్రతినిధులు

భీం వర్ధంతిలో అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, డీఎస్పీ వెంకటరమణ, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, సీఐలు, ఎస్‌ఐలు, డీఎంహెచ్‌వో తుకారాం భట్, ఆయా శాఖల అధికారులు, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీలు సెడ్మాకి దుర్పతాబాయి, కోవ అరుణ, అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో మహేందర్, తహసీల్దార్ జమీర్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

### కుమ్రం భీం పోరాటం స్ఫూర్తిదాయకం

**- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

కుమ్రం భీం పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. భీం వర్ధంతి సందర్భంగా జోడేఘాట్‌లో ఏర్పాటు చేసిన వేడుకల కు హాజరయ్యారు. భీం వారసులు, మనువడు కుమ్రం సోనేరావు దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం, వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన ధీరుడు కుమ్రం భీం అని కొనియాడారు. ప్రభుత్వం గిరిజనులు, ఆదివాసుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. పోడు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజన రైతులకు పట్టాలు అందించిందని చెప్పారు.

### ఆదివాసుల సంక్షేమానికి కేసీఆర్ కృషి

ఆదివాసుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారు. 2014లో ఆయన దర్బారుకు హాజరయ్యారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. రూ. 25 కోట్లతో జోడేఘాట్‌ను అభివృద్ధి చేశారు. ఆదివాసుల సంప్రదాయాలకు అద్దం పట్టేవిధంగా మ్యూజియం ఏర్పాటు చేశారు. జోడేఘాట్‌కు రోడ్డు వసతి కల్పించారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించారు. ఆదివాసీలు తరతరాలుగా ఎదుర్కొంటున్న పోడు భూ సమస్యలకు పరిష్కారం చూపించారు. పోడు భూములకు పట్టాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. మున్ముందు ఆదివాసులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. కుమ్రం భీం ఆశయాలను నెరవేరుస్తాం.

**- కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ జడ్పీ చైర్‌పర్సన్**

### అడవిబిడ్డల ఆశయనకు సాధనకు కృషి

నాడు జోడేఘాట్‌ను పట్టించుకున్నోళ్లు లేకుండే. సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేశారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. ప్రధానంగా రెండు వరసల రహదారి నిర్మించడంతో మెరుగైన రవాణా సౌకర్యం కలిగింది. ఆదివాసీ గ్రామాలను కూడా ఎంతో అభివృద్ధి చేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీరందించారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇచ్చారు. విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. ముఖ్యంగా పోడు పట్టాలు అందించి దశాబ్దాల కల నెరవేర్చారు. అడవిబిడ్డల ఆశయ సాధనకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయం. **- ఆత్రం సక్కు, ఎమ్మెల్యే**

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

తెలంగాణ ఏర్పడిన తర్వాత జోడేఘాట్‌ను సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. ఆదివాసులకు పోడు పట్టాలు అందించి శాశ్వత పరిష్కారం చూపారు. భీంకు వారసులమైన మేము కేసీఆర్ వల్లే బాగుపడ్డాము. మా కుటుంబంలో ఒకరికి టీచర్ ఉద్యోగం, మరొకరికి సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. మాకు ఐదు ఎకరాల భూమి కూడా ఇచ్చారు. ఆయనకు మేమంతా రుణపడి ఉంటాం. కేసీఆర్‌తోనే ఆదివాసీలకు న్యాయం జరిగింది.

**- కుమ్రం సోనేరావ్, కుమ్రం భీం మనుమడు**